ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలో అంగన్‌వాడీలకు మే నెలలో సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ నాయకులు కోరారు. అంగన్వాడి కేంద్రాలకు వేసవికాలం సెలవులు ప్రకటించాలని కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా కేంద్రాలకు పిల్లలను పంపడానికి తల్లులు ఆసక్తి చూపడం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముత్యంరావు, శోభ, అంజనాదేవి, శ్యామల, రామలక్ష్మి, కృష్ణకుమారి, సుగుణ, మహేశ్వరి, సులోచన, వసంత, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై కలెక్టర్ సీరియస్

- ఖని జనరల్ ఆసుపత్రిలో క్యూఆర్ కోడ్ తొలగింపు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిటీ స్కాన్, 2డీ ఎకోకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయవద్దని, ఎవరైనా రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో సిటీ స్కాన్‌కు రూ.2 వేలు, 2డీ ఏకోకు రూ.200 వసూలు చేయడానికి క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయగా గురువారం వాటిని ఆసుపత్రి సిబ్బంది తొలగించారు. ఆసుపత్రిలో కాంట్రాస్ట్ ఇంజెక్షన్‌కు తన నిధుల నుంచి డబ్బులు మంజూరు చేస్తానని, రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

మాతృ మరణాలను అరికట్టాలి

- డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో మాతృ మరణాలను అరికట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్నప్రసన్న కుమారి తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో యూపీహెచ్‌సీ అడ్డగుంటపల్లి, పిహెచ్‌సి రాఘవాపూర్ పరిధిలో రెండు మాతృ మరణాలు సంభవించాయని అన్నారు. మాతృ మరణాల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. మాతృ మరణాలు నివారించడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, గైనకాలజిస్టులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ శ్రీదేవి, సంబంధిత వైద్యాధికారులు డాక్టర్ మమత, డాక్టర్ సదానందం, డాక్టర్ మాణికేశ్వర్ రెడ్డి, వి. జమున, నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ దృష్టి

- మే 20 వరకు డీసీసీ అధ్యక్షుల నియామకాలు
- మే నెలాఖరు వరకు గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు
- జిల్లాకు ఇద్దరు పీసీసీ పరిశీలకుల నియామకం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి బలంగా తీసుకవెళ్లాలని భావిస్తోంది. జూన్, జూలై మాసాల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని గుజరాత్ మోడల్‌లో సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీకి డోకా ఉండదని భావిస్తున్న పార్టీ పెద్దలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మే 20వ తేదీ నాటికి డీసీసీ అధ్యక్షులు, మే నెలాఖరు వరకు గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేసేందుకు జిల్లాకు ఇద్దరు పీసీసీ అధ్యక్షులను నియమించారు.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీగా మీనాక్షి నటరాజన్ నియమితులైన నాటి నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ పని తీరు, పార్టీ పరిస్థితిపై అధ్యయనం చేశారు. ఒక నివేదికను పార్టీ అధిష్టానానికి అందించిన నటరాజన్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. 2023 నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 15 నెలల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ సేవలు 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డుల మంజూరు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే వంట గ్యాస్ పంపిణీ, రైతుల రుణమాఫీ, రైతు భరోసా, తదితర పథకాలను అమలు చేస్తున్నది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగాల భర్తీ, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు చేయ డంతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇవన్నీ చేస్తున్నా ప్రజల నుంచి ఆశించిన మేరకు స్పం దన రావడం లేదని, ఇందుకు కారణం సంస్థాగత నిర్మాణం లేకపోవడమేనని గ్రహించారు. పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలపైనే ఎవరికి వారుగా దృష్టి సారించారే తప్ప ప్రభుత్వపాలన తీరు గురించి ప్రజ లకు వివరించడం లేదు. ప్రతిపక్ష పార్టీల విమర్శలను తిప్పి కొట్టడంలో వెనుబడి ఉన్నారని గ్రహించారు. మూడేళ్ల క్రితం నియమించిన డీసీసీ అధ్యక్షులు, గ్రామ, మండల కమిటీల అధ్యక్షులే ఉన్నారు. ఈ కమిటీలను నియమిస్తే పార్టీ బలోపేతం అవుతుందని అధిష్టానం భావించింది. పదిహేను రోజులుగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ పార్ల మెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ముఖ్యులతో సమావేశాలు నిర్వహించారు. గుజరాత్ మోడల్‌లో సంస్థాగత నిర్మాణం చేప ట్టాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతా నికి జిల్లాకు ఇద్దరు పరిశీలకులను నియమించారు. జిల్లా పరిశీలకులుగా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్‌ను

(మిగతా 6వ పేజీలో)

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

పెద్దపల్లిటౌన్ ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం చేపడుతామని ఎంప్లాయిస్ జేసీ చైర్మెన్ బొంకూరి శంకర్ పేర్కొన్నారు. గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ కష్టపడి పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రభుత్వానికి గుర్తింపునకు కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు సంబంధించిన చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి అండగా ఉంటూనే ఉద్యోగుల సమస్యల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. కన్వీనర్ తూం రవీందర్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చే కార్యక్రమాలను ఉద్యోగుల్లోకి తీసుకెళ్లి ఉద్యమం చేస్తామని తెలిపారు. సత్యనారాయణ, బ్రహ్మానంద రెడ్డి, పి కిషన్, గండు కృష్ణమూర్తి, మెరుగు సతీష్, కే లక్ష్మణ్, కే సారయ్య పాల్గొన్నారు

ముఖ్యమంత్రి, మంత్రిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే



గోదావరిఖని, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జపాన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో గురువారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిశారు. జపాన్ పర్యటన, పెట్టుబడులపై వారు చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చెప్పారు.

ఉగ్రదాడి ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు



కాల్వశ్రీరాంపూర్‌లో కొవ్వొత్తులతో బీజేపీ నాయకుల ర్యాలీ

ప్రాహిబిటెడ్ ప్లాట్లకు మోక్షం

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన యంత్రాంగం

కోల్‌సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ప్రొహిబిటెడ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభిస్తుంది. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 19న 'ఎల్ఆర్ఎస్ తెచ్చిన తంట' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖలు చాలా ప్లాట్లకు ఇష్టానుసారంగా ప్రొహిబిటెడ్‌లో పెట్టారు. వివిధ మున్సిపాలిటీల్లో సర్వే నెంబర్ల వారీగా టౌన్ ప్లానింగ్ విభాగాలు జాబితాలను కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేష్‌శాఖలు దరఖాస్తులను పరిశీలన చేసి ఎన్ఓసీలు జారీ చేస్తున్నారు. అయా మున్సిపాలిటీలతో పాటు రామగుండం నగర పాలక సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి ఏ శాఖ నుంచి ఎన్ఓసీ తీసుకురావాలో సూచన చేస్తున్నారు. రామగుండంలో గురువారం ఒక్క రోజే ఇరిగేషన్‌శాఖ పరిశీలన జరిపి 50ఎన్ఓసీలు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీతో ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ముగుస్తుండడంతో ప్రక్రియ వేగవంతం చేశారు.

వికసిత్ భారత్ సదస్సులో పాల్గొన్న ఎంపీ

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్ డా. బిఆర్ అంబేద్కర్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఎంపీ వంశీ కృష్ణ గురువారం పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 స్థిరమైన అభివృద్ధి, సంక్షేమం, పాలన కోసం రోడ్‌మ్యాప్ అనే అంశంపై సదస్సు సాగింది. ఎంపీ మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక, సాంకేతిక, సామాజిక రంగాల్లో సమగ్ర అభివృద్ధి అవసరాన్ని ఆయన వివరించారు. విద్యారంగం, పాలనా వ్యవస్థల్లో పారదర్శకత, సమర్థత పెంచాల్సిన అవసరంపై వివరించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు

ప్రభావిత గ్రామాలపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

అంతర్గాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యాష్ పాండ్ పైపులైన్ పగిలిన సంఘటనలో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్యం కనబడుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. కుందనపల్లి ఏరియా అక్బర్‌నగర్‌లో ఎన్టీపీసీ యాష్‌పాండ్ పైపులైన్ పగిలి ఇళ్లలోకి బూడిద నీరు చేరింది. గురువారం ఎంపీ అక్బర్‌నగర్‌ను సందర్శించారు. బూడిద నీరు కారణంగా అస్తవ్యస్తమైన నివాస గృహాలను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రభావిత గ్రామాలపై నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఎన్టీపీసీ నిర్లక్ష్యవైఖరి కారణంగా జరిగిన సంఘటనను కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకుపోతానని పేర్కొన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్‌సీడీ ద్వారా సమీప గ్రామాల అభివృద్ధికి ఎంత నిధులు వెచ్చిస్తున్నదో తెలుపాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్ ఇఫ్తేకార్ అహ్మద్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి సమస్యలపై మాట్లాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాబర్ సలీంపాషా, ఠాకూర్ అయోధ్య సింగ్, పిల్లి మలి కార్జున్, జీన్స్ అనుమాస్ శ్రీనివాస్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, లియాకత్ అహ్మద్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): రామగుండం అక్బర్‌నగర్ కాలనీవాసులు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ భరోసా ఇచ్చారు. బుధవారం రాత్రి ఎన్టీపీసీ నుంచి కుందనపల్లికి వెళ్లే యాష్‌పైప్‌లైన్ పగలడంతో ఇండ్లలోకి నీరు వచ్చిందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్, ఎన్టీపీసీ అధికారులతో చర్చించామన్నారు. రిటర్నింగ్ వాల్ నిర్మించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ఆదేశించినట్టు పేర్కొన్నారు.

భూభారతి చట్టంతో రైతులకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూమి సమస్యలు భూభారతితో పరిష్కారం అవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం లక్ష్మిప్రసన్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణ యంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవో గంగయ్య, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళసుమన్‌రెడ్డి, ఏఎంసీ మార్కెట్ కమిటీ సభ్యులతో పాటు తహసీల్దార్, మండల ప్రజలు పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాల తనిఖీ

వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన 24 గంటల్లోగా మిల్లులకు తరలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో ప్యాడి క్లీనర్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో జనరల్ వార్డు, ల్యాబ్స్, వ్యాక్సిన్ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి ఔట్ పేషెంట్లు వస్తున్న వారి సంఖ్య, వివరాలు, ఆరోగ్య పరీక్షల వివరాలతోపాటు డయాగ్నొస్టిక్ వాహనం వివరాలు, డాక్టర్ షహబాజ్ ఖాన్‌ను తెలుసుకున్నారు. సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయసాయం అందుబాటులో ఉంటుందన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజులలోగా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో భూమికి భూదార్ కార్డు అందిస్తామన్నారు. పెండింగ్ సాదాబైనా మాల పరిష్కారానికి భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



భూ భారతి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- రాజీవ్ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- పెద్దపల్లిలో బైపాస్ లేక ఇబ్బందులు
- ట్రాఫిక్ సిబ్బంది కొరత



కమాన్ చౌరస్తాలో వాహనాల రాకపోకలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోడ్డు ప్రమాదాలతో రాజీవ్ రహదారి రక్తసిక్తమవుతుంది. రాజీవ్ రహదారి వాహనాల రాకపోకలతో రద్దీ ఉంటుంది. పెద్దపల్లి పట్టణానికి బైపాస్ లేకపోవడం, వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాతపడుతుండగా మరి కొందరు క్షతగాత్రులవుతున్నారు.

జిల్లా కేంద్రంలో రంగంపల్లి నుంచి మంథని ఫ్లఓవర్ బ్రిడ్జి వరకు ఏదో ఒక చోట నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ శాతం యూటర్న్‌లు, సిగ్నల్స్ వద్దే జరుగుతున్నాయి. అయినా ట్రాఫిక్ పోలీసుల పట్టింపు లేకుండా పోయింది. సిగ్నల్ల వద్ద, ప్రధానకూడళ్ళ వద్ద ఉంటున్న ట్రాఫిక్ పోలీసులు చాలన్ల వసూళ్ళపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసుల ముందే ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంప్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లో వెళ్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇవేవీ పట్టించుకోకుండా సెల్‌ఫోన్ చూడడం, చాలన్లకే పరిమిత మవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాహనదారులు సిగ్నల్స్ లెక్క చేయకుండా వెళ్తున్నారు. బస్టాండ్ వద్ద ఉన్న సిగ్నల్ కొంత కాలంగా మోరాయిస్తోంది. కునారం రోడ్డు, కమాన్ వద్ద సిగ్నల్లను వినియోగంలోకి తీసుకురావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే అయ్యప్ప టెంపుల్ చౌరస్తాలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులతో బిజి బిజీగా ఉంటుంది. ద్విచక్ర వాహనాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కమాన్ వద్ద ఉన్న సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికి ఇరుకు రోడ్డు ఉండడం వల్ల వినియోగించడం లేదు. ట్రాఫిక్ సిబ్బంది ఉండే పరిస్థితి లేదు. వాహనాల తనిఖీలు చేపట్టినప్పుడు పత్రాలు సక్రమంగా లేని వారు, ఛాలన్ల బాకీ ఉన్న వారు పోలీసులను చూసి అడ్డదిడ్డంగా వెళ్తే ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. రంగంపల్లి నుంచి మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ప్రమాదాలు జరిగి వారానికి ఇద్దరు ముగ్గురు మృత్యువాత పడుతున్నారు. సరిపడా పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణ చేయలేకపోతున్నారు. సరి పడా సిబ్బందిని నియమించి సిగ్నళ్లను వినియోగంలోకి తెచ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. అలాగే సిగ్నల్లపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా పరిధిలో రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు

జిల్లా పరిధిలో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. పెద్దపల్లి పరిధిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు ఏఎస్సైలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్ళు , 43 మంది కానిస్టేబుళ్ళు పని చేయాల్సి ఉంటుంది. అయితే కేవలం 21 మంది మాత్రమే పని చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యను నియంత్రించ లేకపోతున్నారు.

బైపాస్ రోడ్డు లేక పోవడమే కారణం

ట్రాఫిక్ సీఐ అనీల్



పెద్దపల్లికి బైపాస్ రోడ్డు లేకపోవడమే ట్రాపిక్ సమస్య తీవ్రంగా ఉంది. సిబ్బంది సెలవులు పెడితే మరింత సమస్య ఉంటుంది. ఉన్న సిబ్బందితో ముఖ్యమైన ప్రాంతాల్లో వాడుకుంటున్నాం. హైవే పెట్రోలింగ్ నిర్వహించలేక పోతున్నాం. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసిన యువకులు

- ప్రయాణికుడిపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ రోడ్డుపై డ్యాన్సులు చేస్తూ బస్సుకు సైడ్ ఇవ్వమని అడిగినందుకు బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతోపాటు ప్రయాణికుడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని జంగపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కరీంనగర్ నుంచి చొక్కారావుపల్లికి వెళుతున్న లాస్ట్‌ట్రిప్పు ఆర్టీసీ బస్సు (టీఎస్02యుబీ7429) జంగపల్లి గ్రామానికి చేరుకుంది. అదే సమయంలో స్థానిక ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ బస్సును చాలా సమయం రోడ్డుపై నిలిపి వేచిచూశాడు. బస్సులోని ప్రయాణికులు బస్సును ముందుకు నడిపించాలని డ్రైవర్‌ను కోరగా డ్రైవర్ మొండయ్య, కండక్టర్ ప్రవీణ్‌తోపాటు విధులు ముగించుకొని అదేబస్సులో వస్తున్న మైలారంకు చెందిన మరోడ్రైవర్ పులి అనిల్ బస్సుకు దారి ఇవ్వమని అడిగారు. దీంతో ముదిరాజ్ కులస్థులైన చింతల రమేష్‌తోపాటు మరికొందరు యువకులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. పులి అనిల్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో బస్సు డ్రైవర్ మొండయ్య ధ్వంసమైన బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు విషయాన్ని తెలిపాడు. డ్రైవర్ మొండయ్య ఫిర్యాదు మేరకు చింతల రమేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

గంభీరావుపేట ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డులో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కనెక్షన్ కూడా లేదని, ఈ విషయం సంబంధిత అధికారులతో ఎన్నోసార్లు చెప్పానమని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని మంచినీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు.

కూరగాయల సాగులో మహిళా రైతులు

- నేరుగా మార్కెట్‌లో విక్రయాలు
- నెలకు రూ.30 వేల ఆదాయం



మల్లాపూర్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన పలువురు మహిళా రైతులు కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మెట్‌పల్లి డివిజన్‌లో కూరగాయల సాగులో మొగిలిపేట గ్రామం రెండో స్థానంలో ఉంది. గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో మహిళా రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చూస్తూ దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి విక్రయాలు చేస్తున్నారు. 20 మంది మహిళా రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజి, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలను పండిస్తున్నారు. పండించిన కూరగాయలను నేరుగా మెట్‌పల్లి, మల్లాపూర్, నిర్మల్ జిల్లా ఖానాపూర్ తదితర మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తున్నారు. నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.



మొగిలిపేటలో మహిళా రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలు

కూరగాయల సాగు లాభాదాయకం
-సామ రాధ, రైతు, మొగిలిపేట



మిగిలిన పంటలతో పోలిస్తే కూరగాయాల సాగు లాభదాయకంగా ఉంటుంది. దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడంతో మరింత లాభాలు వస్తాయి. ప్రతి రోజు ఉదయం తోటకు వెళ్లి నీరు పెట్టి పండిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతా.



మార్కెట్‌లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళా రైతులు

నెలకు రూ.30 వేల ఆదాయం
-దామెర లత, రైతు, మొగిలిపేట



గ్రామంలో 20 మంది మహిళా రైతులం కలిసి పండించిన కూరగాయలను మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తాం. నెలకు సుమారు రూ.30 వేల ఆదాయం వస్తుంది. మాకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజి, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలు పండిస్తా.

కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలి..

శంకరపట్నం, ఏప్రిల్ 24 (ఆంధజ్యోతి): కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలని జాతీయ రహదారి-563లో నివేశనస్థలాలు కోల్పోతున్న నిర్వాసితులు వేడుకున్నారు. గురువారం శంకరపట్నంలో భూభారతి కొత్తచట్టంపై రైతుఅవగాహన సదస్సుకు వచ్చిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కేశవపట్నంలోని సర్వే నంబర్ 552లో నివేశనస్థలాలను కోల్పోతున్న నిర్వాసితులు వినతిపత్రం అందజేసి, తమగోడు వెళ్లబోసుకున్నారు. తమస్థలాలకు మూడేళ్లక్రితమే వాస్తవ బహిరంగ మార్కెట్ ధర చదరపు గజానికి రూ.20వేలు పలుకగా, జాతీయరహదారి విస్తరణలో భాగంగా సేకరించిన తమ ఓపెన్‌ప్లాట్లకు మాత్రం 2013మార్కెట్ వాల్యూ ప్రకారం అధికారులు చదరపు గజానికి కేవలం రూ.1221 మాత్రమే నష్టపరిహారంగా చెల్లించి చేతులు దులుపుకున్నారన్నారు. 2013నుంచి పరిహారం చెల్లించే సమయంవరకు అధికారులు మార్కెట్‌వాల్యూను కూడా రివైజ్ చేయలేదన్నారు. అంతేకాక ప్రధానరహదారికి పక్కన ఒకవైపు మిషన్ భగీరథ పైపులైను వేయడంతో కేవలం తమవైపు మాత్రమే అధికమొత్తంలో స్థలాలను కోల్పోయామన్నారు. మా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసాపైసా పోగుచేసి కూడబెట్టిన కష్టార్జితంతో ఈ ప్లాట్‌లను కొనుగోలు చేశామన్నారు. ఆర్బిట్రేషన్‌లో భాగంగా ప్రస్తుతం ఫైలు మీ పరిశీలనలో ఉన్నదని, మీరైనా కనికరించి వాస్తవ బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం ధర చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పల్కల శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి మహేందర్‌రెడ్డి, పొన్నపూల రాజయ్య, జనగాం బుచ్చయ్య, నామని సంపత్, సిరిసేటి స్వరూప, గోపు మాధవి-శ్రీనివాస్‌రెడ్డి, కాటం వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అల్గునూరులో 60 బస్తాల ధాన్యం చోరీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్గునూర్‌లో ఓ రైతు ఖాళీస్థలంలో ఆరబోసుకున్న వరిధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. అలుగునూర్‌కి చెందిన ముంజ రాములు మూడురోజుల క్రితం వరికోసి వచ్చిన ధాన్యాన్ని వెంకటేశ్వరకాలనీ సమీపంలో ఓఖాళీ స్థలంలో ఆరబోసుకున్నాడు. అయితే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆరబెట్టుకున్న ధాన్యంలో సుమారు 60బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లారు. ధాన్యం విలువ సుమారు 50వేల రూపాయల ఉంటుందని రైతు రాములు వాపోయాడు. సంఘటన స్థలంలో కొన్ని సంచులు నింపిఉన్నాయి. ధాన్యం తీసుకెళ్లిన వారి చెప్పులు అక్కడే విడిచిపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా అలుగునూర్‌తోపాటు తిమ్మాపూర్ మండలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలుగునూర్‌లో ఈ మధ్య రెండు బైకులు, ఎల్ఎండీ కాలనీలోని సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లారు. మిర్చియార్డులో దొంగలుపడి రూ.80వేల నగదు ఎత్తుకెళ్లారు. పలుగ్రామాల ఆలయాల్లో బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

చెట్లను తొలగించిన సెస్ సిబ్బందిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అనుమతి లేకుండా రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లను తొలగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, రాజన్నపేటకు చెందిన సెస్ సిబ్బంది దాసరి బాబు, ద్యాప లక్ష్మణ్ లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ నిధులతో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించారని పేర్కొన్నారు. చెట్లను నరికి వేయడంతో సుమారు రూ.1,00,978 నష్టం వాటిల్లిందని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన జగిత్యాల పట్టణం వాణినగర్‌కు చెందిన గడ్డం ఆంజనేయులును పోలీసులు అరెస్ట్ చేశారు. ధరూర్ గ్రామానికి చెందిన కొత్తలక్ష్మీ, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కడార్ల నరసింహచారి అనే ఇద్దరు వ్యక్తుల ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఆంజనేయులును అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై దాడికి పాల్పడిన సంఘటనలో మామతో పాటు బామర్దిపై కేసు నమోదైన సంఘటన చందుర్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన నాగుల రాజు తన భార్యతో బుధవారం రాత్రి పశువులకు దాణా పెట్టడం విషయంలో గొడవ పడడంతో, భార్య తన కుమారుని తీసుకొని తల్లిగారి ఊరైన ఇదే మండలంలోని సనుగులకు వెళ్లింది. దీంతో రాజు భార్యను తీసుకరావడానికి సనుగుల గ్రామంలోని తన భార్య వద్దకు వెళ్లగా మామ బూర్ల మల్లయ్య, బామ్మర్ది బూర్ల పవన్‌లు రాజును కర్రతో చితికబాదడంతో తలకు, చేతికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లయ్య, పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజయ్య తెలిపారు.

రేణికుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి, మరో ఆరుగురికి తీవ్రగాయాలు



రేణికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం



బీరెడ్డి నక్షత్రమ్మ(ఫైల్)



కాసర్ల తిరుపతి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట వద్ద గురువారం ప్రయాణికులతో వెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో సంఘటన స్థలంలో ఒకరు, ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరొకరు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్ఎండీపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల తిరుపతి(55) గురువారం ఆటోలో ప్యాసింజర్ లను ఎక్కించుకొని బెజ్జంకి నుంచి కరీంనగర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులో వేగంగా వస్తున్న బియ్యం లోడ్‌లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటలో ఆటోడ్రైవర్ కాసర్ల తిరుపతి అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణి స్తున్న ఆరుగురు త్రీవంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోట్స్ సిబ్బంది రాజు స్థానికుల సాయంతో క్షతగాత్రులను అంబులెన్సుల్లో కరీంనగర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ఇందులో ఆటోలో ప్రయాణిస్తున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి గ్రామానికిచెందిన బీరెడ్డి నక్ష త్రమ్మ (57) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆటోలో ప్రయాణి స్తున్న ప్రయాణికులు బెజ్జంకి మండలం గుగ్గిళ్లకు చెందిన పున్నం సాయికిరణ్, బెజ్జంకికి చెందిన బీరెడ్డి ఆనందర్‌రెడ్డి, ఐలెని నవీన్‌రెడ్డి, కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల కరుణ, చింతకుంటకు చెందిన మౌనిక, బెజ్జంకి మండలం దాచారం గ్రామానికి చెందిన కొలిపాక మంజుల తీవ్రగాయాలతో ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు.. ప్రమాదానికి కారణమైన లారీని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

సంఘట స్థలాన్ని కరీంనగర్‌రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్ పరిశీలించారు. ప్రమాదం ఏలా జరిగింది అనే దానిపై ఎల్ఎండీ ఎస్సై వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా డివైడర్ల వెంట లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వెలుతురు లేక రోడ్డుప్రమాదాలు సంభ విస్తున్నాయని, వెంటనే లైట్లను ఏర్పాటు చేయాలని హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా సిబ్బందిని ఏసీపీ ఆదేశించారు.

ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కసర్ల తిరుపతి(55) తన కూతురు మౌనికకు పసిరికలు(జాండిస్) మందుకోసం భార్య కరుణతో కలిసి అంటకాలపల్లి వచ్చి వెళుతున్నాడు. ఈ ప్రమాదంలో తిరుపతి మృతి చెందగా, భార్య కరుణ, కూతురు మౌనిక తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బెజ్జంకి ఎక్స్ రోడ్డులో ఉంటున్న బీరెడ్డి నక్షత్రమ్మ ఈ మధ్యనే రేకుర్తిలో కంటికి చికిత్స చేయించుకుంది. గురువారం చెకప్‌కు వెళ్లేందుకు భర్త బీరెడ్డి ఆనంద్‌రెడ్డితో కలిసి ఆటోలో ఎక్కగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో మృతిచెందింది.

శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మంటలు



చెలరేగుతున్న మంటలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలో ఎండుగడ్డికి మంటలు అంటుకుని ఎస్‌యూ పాలనాభవనాల వరకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కరీంనగర్, మానకొండూర్, వేములవాడ ఫైర్ ఇంజన్‌లతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. గురువారం ఉదయం 11:30 గంటల నుంచి రాత్రి వరకు మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఒక వైపు మంటలను నీటితో అదుపులోకి తీసుకువస్తుండగా మరో వైపునకు మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలంలోనే ఉండి అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. కరీంనగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మందికిపైగా సిబ్బంది ఈ ఫైర్‌ఫైటింగ్‌లో పాల్గొన్నారు. ఎస్‌యూ విశాలమైన ఆవరణలో చెట్లు, గుట్టలు, ముళ్లపొదలు నిండిఉంటాయి. ప్రతి సంవత్సరం ఇలాగే రెండు మూడుసార్లు గడ్డికి, చెత్తకు మంటలు అంటుకుని అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ అగ్నిప్రమాదాలలో విలువైన, అరుదైన మొక్కలు కాలిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం 200 ఎకరాలలో విస్తరించి ఉన్నది. ఇక్కడ ఎలుగుబంట్లు, కొండగొర్రె, నెమళ్లు, కుందేళ్లు, కొండచిలువలు, పక్షులు నివసిస్తున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగినపు డు జంతువులు, పక్షులకు ప్రాణసంకటంగా మారుతోంది.

కోతుల దాడిలో రైతుకు గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రైతుపై కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పుట్ట రాజారాంరెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద కూరగాయలు సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం ఒక్కసారిగా వందలాది కోతులు పంటపై దాడి చేస్తున్నాయి. వీటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా మూడు కోతులు రైతుపై దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో గాయపడిన రైతు కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.

సారీ నాన్న.. నాకు బతకాలని లేదు

- అద్దంపై రాసి యువతి ఆత్మహత్య



ప్రసన్నలక్ష్మి (ఫైల్)

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సారీ నాన్న.. నాకు బతకాలని లేదు అంటూ జగిత్యాలకు చెందిన ఓ యువతి అద్దంపై రాసి గురువారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా పోచమ్మ వాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రసన్నలక్ష్మి(28)కి వెల్గటూర్ మండలం రామునూరి గ్రామానికి చెందిన గాంధారి తిరుపతికి 2023లో వివాహం జరిగింది. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా వీరికి సంవత్సరం క్రితం బాబు జన్మించడంతో ప్రసన్నలక్ష్మి ఉద్యోగం మానేసింది. కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ప్రసన్నలక్ష్మి గురువారం తల్లిదండ్రులు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా తన కుమారుడిని తనభర్తకు గాని అత్త మామలకు గాని ఇవ్వొద్దని ఆత్మహత్యకు ముందు సూసైడ్‌నోట్ రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా భర్తతోపాటు అత్త, మామ వేధింపులకు గురిచేయడంతోనే ప్రసన్నలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

అవగాహనతోనే అడ్డుకట్ట

- వ్యాధి తీవ్రత తగ్గించడంపై చర్యలు
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మలేరియా ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన వ్యాధిల్లో ఒకటి. 2017లో ప్రపంచ వ్యాప్తంగా 21.9 కోట్లకుపైగా కేసులు, 4.35 లక్షల మరణాలకు కారణమైంది. ఈ సంఖ్యను తగ్గించడానికి, వ్యాధి దాని నివారణ గురించి అవగాహన పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా చర్యలు తీసుకున్నారు. ప్రారంభ లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వ్యాధిని తగ్గించవచ్చని గుర్తించారు. మలేరియా మరణాలను తగ్గించడంపై చాలా దేశాల్లో చర్యలు చేపట్టారు. ఇందుకు అనుగుణంగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇది ప్రపంచం దృష్టిని ఆకర్షించడానికి, ప్రజలు ప్రభావితమయ్యే తీవ్రతను తగ్గించడంలో సహాయం చేయడానికి ఒక వేదికగా నిలిచింది. కొవిడ్ కారణంగా మలేరియా సేవలలో కొంత అంతరాయం కలిగింది. దాంతో గతంలో కంటే వేయి కేసులు పెరిగాయి. మలేరియా అనే పరాన్నజీవి ఇన్ఫెక్షన్ ఆడ(అనాఫిలిస్)దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది తీవ్రమై కొన్నిసార్లు ప్రాణాంతక అనారోగ్యానికి కారమణమవుతుందని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 200 కోట్ల మంది మలేరియా బారిన పడుతున్నారనే అంచనా ఉన్నది. 2008లో తొలిసారిగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు.



జిల్లాలో తగ్గిన కేసులు

జిల్లాలో మలేరియా కేసులు క్రమంగా తగ్గుతున్నాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలియచేస్తున్నారు. 2019 నుంచి క్రమక్రమంగా మలేరియా కేసులు తగ్గుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సంవత్సరానికి ఒకటి రెండు చొప్పున నమోదు అయ్యాయని, అది వలస కార్మికులని వైద్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. 2024లో 83,872 మందికి రక్త పరీక్షలు చేశామని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 24,674 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

మలేరియా నివారణ

రాత్రిపూట బయట ఉంటే పొడవాటి చేతుల దుస్తులు, ప్యాంటు వాడాలి. మంచంపై దోమతెరలు కట్టుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి తొట్టిలను ఎల్లప్పుడూ మూతతో కప్పిఉంచాలి.

ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అత్యుత్తమ కేఎంపీఎల్ అవార్డు



ఆర్టీసీ ఎండీచేతుల మీదుగా అత్యుత్తమ అవార్డు అందుకుంటున్న కరీంనగర్ ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అశోక్ లీలాండ్ సంస్థచే అత్యుత్తమ కేఎంపిఎల్, మైలేజ్ అవార్డును హైదరాబాద్ ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్టీసీ అధికారులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌లోబిఎస్-6 బస్సుల అత్యుత్తమ హెచ్ఎస్‌డి కేఎంపిఎల్ 5.86 సాధించినందుకు, అశోక్ లీలాండ్ ఇంజిన్ నందు హైమైలేజ్ 20.40 లక్షల కిలోమీటర్లను సాధించినందుకు రాష్ట్రస్థాయిలో అవార్డులను కరీంనగర్-2 డిపో సాధించింది. ఎండీ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్ఎం బి రాజు, కరీంనగర్-2 డిపోమేనేజర్ శ్రీనివాస్, గతంలో పనిచేసిన వి మల్లయ్య అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మునిశేఖర్, సోలమన్, ఖుస్రోషాఖాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

● 165 గ్రాముల గంజాయి స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడు పట్టణంలో గంజాయి కొనుగోలు చేసి రైలులో కోరుట్లకు చేరుకున్న ఇద్దరు వ్యక్తులను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన గాజుల లిఖేష్ అదే గ్రామానికి చెందిన బాలుడు తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి కోరుట్ల, కథలాపూర్ మండలంతో పాటు కోరుట్ల పట్టణంలో యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడు మహారాష్ట్రలోని నాందేడు వెళ్లి అక్కడ 164 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి బుధవారం రాత్రి కోరుట్ల పట్టణానికి చేరుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో వారిని సోదా చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో గంజాయి లభించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల సీఐ సురేష్‌బాబులు అభినందించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గన్నేరువరం

- మండలానికి పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులు
- సౌకర్యాలు కల్పించాలని డిమాండ్


ఖాసింపేట మానసాదేవి ఆలయం

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన గన్నేరువరం మండలం ఆధ్యాత్మిక కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. మండలంలో ఆలయాలకు భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మానేరు డ్యాంను ఆనుకుని ఉన్న గన్నేరువరం మండలంలో సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని అరుదైన ఆలయాల గురించి తెలుసుకుందాం..

● మానసాదేవి ఆలయం..

మండలంలోని ఖాసింపేటలో స్వయంభువుగా వెలసిన పవిత్రమైన ఆలయం మానసాదేవి ఆలయం. భారతదేశంలో ఈ ఆలయం మొదటిది హరిద్వార్‌లో ఉండగా రెండోది ఖాసింపేటలో ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో వీరభద్రస్వామి ఆలయం ఉండేది. వీరభద్రస్వామి ఆలయ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా మానసాదేవి అమ్మవారి విగ్రహం లభించింది. ఈ విగ్రహం సుమారు 800సంవత్సరాల పురాతనమైందని గ్రామస్థులు నమ్ముతారు. ఆలయంలోని కోనేటిలో ఉన్న 108 శివలింగ జంటనాగ ప్రతిమలు ఉన్నాయి. భక్తులు నీటితో ఈ విగ్రహాలకు అభిషేకం చేస్తారు. ఇది సర్పదోష నివారణకు సహాయపడుతుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయం భక్తుల కోరికలను నెరవేర్చే పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తులు అధికంగా వస్తారు.

● మైలారం మల్లికార్జునస్వామి ఆలయం

మండలంలోని మైలారం గ్రామశివారులో గుట్టపై మల్లికార్జునస్వామి ఆలయం ఉంది. ఆలయ పరిసరాలు గుట్టలు, మానేరు డ్యాంతో ఆహ్లాదభరితంగా ఉంటాయి. ఈ ఆలయానికి ఆది, బుధవారాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేసుకుంటారు. ఆలయం చుట్టూ నల్ల పోచమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, నవగ్రహాల ఆలయం, సమ్మక్క సారలమ్మలు కొలువై ఉన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో స్వామివారి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర వైభవంగా నిర్వహిస్తారు. గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

● పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం

మండలంలోని పారువెల్ల గ్రామంలో స్వయంభువుగా వెలసిన లక్ష్మీగణపతి ఆలయం ఉంది. ఆలయంలో స్వామివారికి తన మనసులోని కోరికను తలుచుకొని ముడుపుకడితే నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. ఇక్కడ పలువురు రాజకీయ నాయకులు ముడుపులను కట్టి గెలిచాక మొక్కులు చెల్లించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆలయంలో ప్రతి సంకష్టహర చతుర్థి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

● 400 ఏళ్ల చరిత్ర గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మండల కేంద్రం గన్నేరువరంలో పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఈ ఆలయం కాకతీయుల కాలంలో సుమారు 400సంవత్సరాల క్రితం మొత్తం రాతితో నిర్మించారు.. ప్రతిఏటా చైత్ర పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతినిత్యం అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం


మైలారంలోని మల్లికార్జునస్వామి ఆలయం


గన్నేరువరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్స్ పూర్తిచేసిన 14వబ్యాచ్ విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్ ప్రదానంచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లాకోర్టు న్యాయవాది పి కళ్యాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగడానికి ఈ బ్యూటీషియన్ సర్టిఫికెట్‌కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈనాటి సమాజంలో బ్యూటీషియన్ రంగంలో అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఈ విద్యార్థినులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఏ జ్యోతి లక్ష్మి, రిసోర్స్‌పర్సన్ ఆర్ లీనా, నితిన్,రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, హరిజోత్ కౌర్, జువాలజీ హెచ్‌ఓడి కిరణ్మయి, ఏవో ఉమారాణి, అర్చన కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బ్యూటీషియన్ కోర్సు విద్యార్థినులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

టీపీసీసీ పరిశీలకుల నియామకం

● కరీంనగర్ జిల్లాకు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ జిల్లా పరిశీలకులను ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నియమించారు. కరీంనగర్ జిల్లాపరిశీలకులుగా టీపీసీసీ సీనియర్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డిలను నియమించారు. రానున్న కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికలను గ్రామశాఖ కాంగ్రెస్, డివిజన్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుల నియామకం కోసం స్థానిక క్యాడర్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించి, నివేదికను ఏఐసీసీ ఇన్‌చార్జికి అందజేయాల్సి ఉంటుంది.

● జగిత్యాల జిల్లా పరిశీలకులుగా వైద్యుల అంజన్‌కుమార్

జగిత్యాలజిల్లా పరిశీలకులుగా టీపీసీసీకార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. అలాగే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నిజామాబాద్ జిల్లాకు, టీపీసీసీఅధికారప్రతినిధి మేన్నేని రోహిత్ రావును సిద్ధిపేట జిల్లా పరిశీలకులుగా నియమించారు.

బాధ్యతలు చేపట్టిన పర్సనల్ ఆఫీసర్

భగత్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకరీంనగర్ రీజియన్ పర్సనల్‌ఆఫీసర్‌గా జి సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగబాధ్యతలు స్వీకరించిన జి సత్యనారాయణను పర్సనల్ ఆఫీసర్ కార్యాలయ అసిస్టెంట్‌మేనేజర్ సత్తయ్య, సూపరింటెంట్ శ్రీనివాస్, సుజాత,వైఎల్‌నారాయణశుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంను ఎత్తుకెళ్లారు. గుండేటి పవన్ అనే యువకుడు ద్విచక్ర వాహనాన్ని బుధవారంరాత్రి మార్కండేయ ఆలయం సమీపంలోని తమ ఇంటిముందు నిలిపి తాళంవేశాడు. గురువారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాయకుల వేధింపులు భరించలేకనే అజ్ఞాతంలోకి..

● సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కార్యదర్శి మంత్రి ప్రియాంక


సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కార్యదర్శి మంత్రి ప్రియాంక

తంగళ్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బానిస లాగా పనిచేయాలి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, నిబంధనల విరుద్ధంగా తమకు నచ్చిన విధంగా పనిచేయాలంటూ నాయకుల వేధింపులు భరించలేక అజ్ఞాతంలోకి వెళ్లానని తంగళ్ళపల్లి మండలం బద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక వెల్లడించారు. రెండు రోజుల క్రితం కార్యదర్శి అదృశ్యం కాగా పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. ప్రియాంకను తీసుకొని గురువారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రియాంక విలేకరులతో మాట్లాడుతూ నలుగురు వ్యక్తులు శ్రీకాంత్, అభినయ్, మల్లేష్‌బాబు, రాజు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, వారి వేధింపులు భరించలేక చెప్పాపెట్టకుండా వాట్సాప్‌లో రాజీనామా లెటర్ పంపి వెళ్లిపో యినట్లు తెలిపారు. నిజాయితీగా పనిచేయలేని పరిస్థితి కల్పిస్తుండడంతో ఉద్యోగం మానేసి దూరంగా వెళ్లిపోవాలని నిర్ణయించుకొని తిరుపతికి వెళ్లినట్లు తెలిపింది. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కమిటీలో సభ్యులుగాఉన్న మల్లేష్‌బాబు, అభినయ్, శ్రీకాంత్‌గౌడ్‌లు అనర్హులను ఎంపిక చేయాలని తీవ్రఒత్తిడికి గురిచేశారన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇంకుడు గుంతల బిల్లులు ఇవ్వాలని మల్లేష్‌బాబు తీవ్ర ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వేధింపులు భరించలేకనే రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించి తిరుపతికి వెళ్లిపోయానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఏదైనా ఉద్యోగం చూసుకొని కుటుంబ సభ్యులకు నిదానంగా చెబుదామని నిర్ణయించుకుని వెళ్లినట్లు తెలిపారు.

కలకలం రేపుతున్న మరణాలు..

- ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

- మరొకరి అనుమానాస్పద మృతి

గంభీరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో గ్రామంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇద్దరు ఒకేఇంట్లో మృతిచెందడం అనుమానాలకు తావిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గజసింగవరంలో గ్రామానికి చెందిన ఉల్లి శ్రీకాంత్(35) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ ఇంటికి సమీపంలో ఉండే చెరుకూరి రేఖ(30) కూడా అదే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీకాంత్ తల్లిదండ్రులు ఇంటికి చేరుకునేసరికి కొడుకు ఉరివేసుకుని ఉండడంతో కేకలువేశారు. దీంతో ఇరుగు పొరుగు వారు చేరుకుని చూసే సరికి శ్రీకాంత్ ఉరివేసుకుని మృతిచెంది ఉండగా, అదే ఇంట్లో రేఖ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. మధ్యాహ్నం నుంచి రేఖ కనిపించడం లేదని, ఆమెకోసం గాలిస్తున్న బంధువులకు సమాచారం అందించారు. రేఖ భర్త బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, స్థానికఎస్ఐ ప్రేమానందం సంఘటన వద్దకు చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి వుషూ ఛాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అమేచ్యూర్ వుషూ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో 3వ తెలంగాణ సబ్ జూనియర్స్ అండ్ జూనియర్స్, 2వ తెలంగాణ సీనియర్స్ వుషూ పోటీలను నిర్వహిస్తున్నట్లు గురువారం అమేచ్యూం వుషూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ రవితేజ, ప్రధాన కార్యదర్శి బీ అఖిల, కోశాధికారి వీ భవాణి తెలిపారు. ఏప్రిల్ తేది 26నుంచి 28 వరకు సిరిసిల్ల పట్టణం పద్మనాయక కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి(ఇంటర్ డిస్ట్రిక్ట్)సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎస్‌యూలో మూడో రోజుకు చేరిన సమ్మె



ఎస్‌యూలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్స్

గణేశ్‌నగర్,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. సైన్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగవిద్యార్థులు తమ మద్దతుప్రకటించి వారితోపాటుకూర్చుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన నలంద డిగ్రీ కాలేజ్, జగిత్యాల ప్రిన్సిపాల్ శ్రీపాదనరేష్, రామకృష్ణడిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రిన్సిపల్ రాజేందర్, రామకృష్ణ డిగ్రీకళాశాల, కోరుట్లప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్‌ఒప్పంద సహాయఆచార్యుల డిమాండ్స్ న్యాయమైనవని పూర్తి మద్దతు తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు



జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి స్వామి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులకు శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్‌డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులు వేర్వేరుగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి వేర్వేరుగా వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి, నంబి నరసింహమూర్తి, అర్చకులు వారందరిని వేర్వేరుగా ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారందరికి వేర్వేరుగా స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బొల్లారపు పోచయ్య, కొమురవెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేష్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బద్దం లింగారెడ్డి, కన్నం అంజయ్య, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబుసిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పీఏపై కేసు నమోదు

హుజూరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ పీఏ శివరాంపై బుధవారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో కేసునమోదైనట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రూరల్‌సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పీఏ శివరాం కారును నడుపుకుంటూ వస్తుండగా, పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు కారును వెంబడించి కేసీ క్యాంపు లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో శివరాంపై డ్రంకెన్‌డ్రైవ్ కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి


గంగారాం(ఫైల్)

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి గంగారాం (65) అనే రైతు గురువారం వడదెబ్బతో మృతిచెందాడు. గంగారాం గోపాల్‌రావుపేట గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పొలంలో వరిని కోత కోయిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి గంగారాం మృతిచెందాడు. మృతుడికి భార్య రాజవ్వ , కుమారులు రాజశేఖర్, రాజు, కూతురు కవిత ఉన్నారు.

ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన

గణేశ్‌నగర్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో గురువారం స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ, కళాశాల టిఎస్‌కెసి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేషస్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళాలో 64 మంది విద్యార్థులు పాల్గొనగా 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టి.రాజయ్య, విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి జాబ్ మేళాలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపి రు.ఈ కార్యక్రమంలో స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ ఎండి మణిదీపక్,టిఎస్‌కెసి కోఆర్డినేటర్ పి రాజేష్, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ హర్ జ్యోత్ కౌర్ తదితారులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో సర్టిఫికేట్‌లతో ఎంపికైన విద్యార్థులు

యువకుడి మృతదేహం లభ్యం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో బుధవారం మునిగిన పట్టణంలోని మంచినీళ్లబావి ప్రాంగణానికి చెందిన నీలి మల్లికార్జున్ మృతదేహం లభ్యం అయినట్లు టౌన్ ఎస్సై మన్మధరావు తెలిపారు. బుధవారం చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతు కాగా పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికించగా గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసనలు



కలెక్టరేట్ ఏవో కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు



సీపీఎం నాయకుల నిరసన



సుల్తానాబాద్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ నేతల శాంతి ర్యాలీ

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బాధిత కుటుంబాలకు సంఘీభావంగా విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ తెలిపారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

అలాగే పహల్గాం కాల్పుల ఘటనను నిరసిస్తూ సీపీఎం నాయకులు బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ ఉగ్రవాదుల సంఘటనను రాజకీయాలకు అతీతంగా ఎదర్కోవాల్సిన అవసరముందన్నారు. ప్రతికార చర్యగా సైన్యానికి పూర్తి అధికారాలివ్వాలని సూచించారు. కల్లెపల్లి అశోక్, సిపెల్లి రవీందర్, జిల్లాల ప్రశాంత్, మొదుంపల్లి శ్రావణ్, దిలీప్, నవీన్ పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): టూరిస్టులపై ఉగ్రవాదులు చేసిని దాడికి నిరసనగా మేడారం న్యాయవాదులు నిరసన తెలిపారు. అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి పహల్గాం ఉగ్ర దాడిని ఖండించారు. వారు మాట్లాడుతూ టూరిస్టులను కాల్చి చంపడం ఉగ్రవాదుల పిరికి చర్య అని, చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, నారా అశోక్ రెడ్డి, ఈదుల ప్రదీప్ రెడ్డి, ఆకారి రాజేశం, భీమారపు సంపత్‌లు పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతులకు ఎన్టీపీసీ కృష్ణానగర్ కాలనీవాసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. కృష్ణానగర్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కృష్ణానగర్ వాసులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతులకు సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పిం చారు. మేడిపల్లి సెంటరు వరకు కొవ్వొత్తుతో ర్యాలీ నిర్వహించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి మాట్లాడుతూ ఇది కేంద్ర ప్రభుత్వం, నిఘా వర్గాల వైఫల్యమే అన్నారు. ఎన్.బిక్షపతి, నాంసాని శంకర్, లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి, రాజ్‌కుమార్, షమీం, శంకర్,కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పలు సంఘాలు, పార్టీలు శాంతి ప్రదర్శనలు కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించాయి. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీధర్మశాస్త్ర గోశాల, హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు నిరసన తెలిపారు. తుమ్మ రాజ్‌కుమార్, ఎనగందుల సతీష్, ఉషణ అన్వేష్ శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ కోర్టులో న్యాయవాదులు నివాళులర్పించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, సీనియర్ న్యాయవాదులు భూసారపు బాలకిషన్ ప్రసాద్, ఆలూరి శ్రీనివాస్ రావు, లక్ష్మీకాంతరెడ్డి, వొడ్నాల రవీందర్, జోగుల రమేష్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు ఖండించారు. కోర్టు ప్రాంగణంలో సభ్యులు ఈ ఘటనను ఖండిస్తూ మృతులకు నివాళులర్పించారు. సివిల్ జడ్జి భవానితో బార్ అసోసియేషన్ సభ్యులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జనరల్ సెక్రటరీ సహేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రఘోత్తంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్ర దాడిపై ఖనిలో నిరసనలు పెల్లుబికాయి. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కళ్యాణ్‌నగర్ నుంచి గోదావరిఖని



కృష్ణానగర్‌లో శాంతిర్యాలీ

ప్రధాన చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ కార్యదర్శి అయోధ్య రవీందర్ మాట్లాడుతూ యాత్రికులపై ఉగ్రవాదులు మూర్ఖపు చర్యలకు పాల్పడి హత్య చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేష్‌శర్మ, రాజేందర్, డాక్టర్ లక్ష్మీవాణి పాల్గొన్నారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గోగుల రవీందర్‌రెడ్డి, తడగొండ నర్సయ్య, సాతిరి గంగరాజు, కోడూరి రవి, బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య, ఆకుల హరిణ్ పాల్గొన్నారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు నుంచి ర్యాలీగా చౌరస్తాకు చేరుకుని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ నాయకులు సతీష్, సంజయ్, గొర్రె రమేష్, సీహెచ్ శైలజ, వర లక్ష్మి, మేడ చక్రపాణి, కుడిది వెంకటేష్, సీతకారి చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, ఫులిపాక రాజ్‌కుమార్, ఫులిపాక ప్రవీణ్ పాల్గొన్నారు. బీజేపీ నాయకుడు కోమళ్ల మహేష్ ఆధ్వర్యంలో రమేష్‌నగర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంజీవ్, పవన్, వికాస్, భాస్కర్, పాల్గొన్నారు. సీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సీహెచ్ ఉపేందర్, మల్లవరపుల వంశీ, దయానంద్‌గాంధీ, రాజేశ్వర్‌రావు, మురళీధర్‌రావు, ముడతనపల్లి సారయ్య, మంథని సంపత్, బిక్షపతి పాల్గొన్నారు. ముస్లీం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు షేక్ హాజీ అలీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని ఖండించారు. మృతుల కుటుంబానికి రూ.1కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. షేక్ హుస్సేన్ బాజీ, మీర్ జాకీర్ అలీ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): కశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గూడెపు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి హతమార్చడం బాధాకరమన్నారు. చల్ల చంద్రమౌళి, మొల్గోజు వెంకటేశ్వర్లు, శంకరచారి, నల్పాల బాలకృష్ణ, గుడ్ల నరేష్, రావుల రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని సకాలంలో చేపట్టాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణం పనులను సకాలంలో చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణం పై అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వరంగల్-మంచిర్యాల మధ్య ఫోర్‌లేన్ గ్రీన్ ఫీల్డు హైవే నిర్మాణం పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణ పనులు పూర్తి చేశామని, పెండింగ్ చెల్లింపులు ఎక్కడైనా ఉంటే పూర్తి చేయాలన్నారు. మంథనిలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలంలో ఉన్న పాత డీఈ ఇరిగేషన్ కార్యాలయాలు, ఇతర కార్యాలయాలు అనువైన చోటికి తరలించే పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి భూమిని త్వరగా అందించాలన్నారు. ఆర్డీవో సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణ ప్రకృతి వనాల పునరుద్ధరణకు చర్యలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రకృతి వనాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం అశోక్‌నగర్ ఉపరితల జలాశయం ఆవరణలోని పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా పచ్చదనం పెంపొందించేందుకు కేటాయించిన నిధులు సద్వినియోగం చేసుకుని అమృత మిత్రల సహకారంతో పకృతి వనాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకం చేపట్టాలని ఆమె సూచించారు. ఫైవింక్లయిన్ ఏరియాలో నిర్మిస్తున్న కల్వర్టు వద్ద సైడ్ వాల్ నిర్మించాలన్నారు. విఠల్‌నగర్‌లోని డ్రైన్ల నిర్మాణ పనులను పరిశీలించారు. 27, 29, 7వ డివిజన్‌లలో పర్యటించి అభివృద్ధి పనులకు సంబంధించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట ఈఈ రామన్, ఏఈ తేజస్విని ఉన్నారు.

వాహనాలకు అనుమతి తప్పని సరి

కోల్‌సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనాల నిర్వాహకులు నగరపాలక సంస్థలో పేర్లు నమోదు చేసుకుని అనుమతి తీసుకోవాలని అదనపు కలెక్టర్, రామగుండం ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ సూచించారు. సేకరించిన సెప్టిక్ ట్యాంకు మల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా రామగుండం మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ఫేకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)కి తరలించాలని కోరారు. జిల్లాలో సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ చేసే అన్నీ వాహనాలు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ అనుమతి పొందకుండా పని చేస్తున్న వాహనాలకు, మల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తున్న వాహనాలకు జరిమానా విధించి, సీజ్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేసే వాహనాల కోసం 14420 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కాంటా వేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు తెలిపారు. రాఘవపూర్, రంగాపూర్, సబ్బితం, అందుగులపల్లి గ్రామాల్లో అప్పన్నపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 5 వందల రూపాయలు బోనస్ కొనసాగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, కార్యదర్శి గడ్డి తిరుపతి, డైరెక్టర్లు, నాయకులు ఆడెపు వెంకటేష్, తోట శ్రీనివాస్, గంట రమేష్, మహేందర్, సారయ్య, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): త్వరలోనే అన్ని గ్రామాలలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. శాస్త్రినగర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ఈ సీజన్‌లో కూడా సన్న వడ్లకు బోనస్ వర్తిస్తుందని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, 48 గంటల్లో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతాయన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళు మంజూ రు చేస్తామని చెప్పారు. సింగిల్ విండో చైర్మ న్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ బూరుగు సంతోష్, విండో డైరక్టర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, రాజలింగం ఉన్నారు.

పీసీసీ పరిశీలకులుగా జిల్లావాసులకు చోటు

సుల్తానాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్‌ను కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కు పీసీసీ పరిశీలకులుగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు అన్ని జిల్లాలకు పరిశీలకులుగా నియమించిన పీసీసీ కమిటీ సుల్తానాబాద్ కు చెందిన అన్నయ్య గౌడ్‌ను ఆసిఫాబాద్ జిల్లాకు, మరో నాయకుడు ఊట్ల వరప్రసాద్‌ను కూడా మెదక్ జిల్లా పరిశీలకులుగా నియమించారు. వీరిని పలువురు అభినందించారు.

బీఆర్ఎస్ పార్టీ పోస్టర్ ఆవిష్కరణ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని గ్రామాలనుండి కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు జాలిగం రఘు, మేరవేన కుమార్, మేర్గవేన మహేష్, చెప్యాల శ్రీకాంత్, తాత రవి, అరవింద్‌లు ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా బోధన ఉండాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉండాలని జెఎన్టీయుహెచ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామివివేక్‌పటేల్ అన్నారు. గురువారం మోడల్ స్కూల్ జరిగిన విద్యపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన అనుముల పోచయ్యను సన్మానించారు. ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో మజ్జిగ పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్యవైశ్య మహాసభ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సంతలో వ్యాపారులు, రైతుకు మజ్జిగను అందజేశారు. అనంతుల రాజు, సతీష్, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

ఎలిగేడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో జనరల్ బాడీ సమావేశం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలు మరింత అమలుచేస్తుందని, కార్మిక వర్గ సమస్యలు పోరాటాల ద్వారా సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు తెచ్చిందని, వీటికి వ్యతిరేకంగా ఐదేళ్లుగా కార్మికవర్గం పోరా డుతోందన్నారు. మే20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా సంపూర్ణ మద్దతుతో సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. దేవయ్య, చంద్రయ్య, మల్లయ్య, సత్యనారాయణ, రమేష్, లక్ష్మణ్, రాజ్ కుమార్, నర్సయ్య, సతీష్, ప్రేమ్‌కుమార్, రవీందర్, పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న విగ్రహ ప్రతిష్ఠ

కమాన్‌పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి బీరన్న ఆలయంలో బీరన్న విగ్రహంతో పాటు అక్కమహంకాళీ, భైరవ విగ్రహాలను గురువారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వివాహానికి చేయూత

పాలకుర్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భామ్లానాయక్ తండాలో పేదింటి వివాహానికి మాజీ సర్పంచ్ రాజునాయక్,లక్ష్మి దంపతులు రూ.10 వేల నగదును గురువారం అందించారు. తండాకు చెందిన బానోతు వీరు లక్ష్మి దంపతుల రెండో కుమార్తె శిరీష అరుణ్ కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. మూడ్ రమేష్, సామ్యూల్, రాజేష్, రాజేందర్, రవి, గోపాల్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల్లో గడ్డి దగ్ధం

రామగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల శివారులో వ్యవసాయ భూమిలో నిల్వ ఉన్న గడ్డి కట్టలు గురువారం దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం సమయంలో దాదాపు ఐదు ఎకరాలకు సంబంధించిన గడ్డి పూర్తిగా కాలిపోయింది. గడ్డి నుంచి భారీ మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంథని ఫైర్ సిబ్బంది హుటాహుటిన మంటలను అదుపులోకి తెచ్చారు.

రేణుక ఎల్లమ్మ గుడికి ఆర్థిక చేయూత

ఎలిగేడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్‌లో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ గుడికి స్వర్గీయ బుర్ర కొండయ్యగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు బుర్ర జగదీశ్వర్‌గౌడ్, వీరస్వామిగౌడ్, ఆంజనేయులుగౌడ్‌లు రూ.33,333లను రేణుక ఎల్లమ్మ గుడి వద్ద గౌడ సంఘం నాయకులు అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్, రంగు శ్రీనివాస్‌గౌడ్‌ల చేతులమీదుగా గ్రామగౌడ సంఘం అధ్యక్షుడు పల్లెర్ల వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బుర్ర సదానందంలకు అందజేశారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ల విడుదల

జ్యోతినగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మేడే పోస్టర్‌ను గురువారం ఐఎఫ్‌టియు యూనియన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. చిలుక శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్మికులను బానిసలను చేసే రీతిలో వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ఎన్‌డీఏ సర్కారు 4 లేబర్ కోడ్‌లుగా తీసుకు వస్తున్నదన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను సవరిస్తోందన్నారు. మేడే స్ఫూర్తిగా రానున్న రోజుల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. నాయకులు బుచ్చన్న, కుమార్, రాజయ్య, రమేష్, కృష్ణ, బి.టి.రెడ్డి, సందీప్, మనోహర్, తిరుపతి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదామని ఇఫ్టూ అనుబంధ ఎస్‌సీసీడబ్ల్యుయూ ఉపాధ్యక్షుడు బీ అశోక్ పిలుపునిచ్చారు. కాలనీలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాల సవరణ చేసే కుట్ర చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా జరగనున్న కోడ్‌ల సవ రణను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. బుచ్చమ్మ, రాజనర్సు, సమ్మక్క, మల్లయ్య, స్వరూప, పద్మ, ప్రేంకుమార్, రవీందర్ పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ దృష్టి

(3వ పేజీ తరువాయి)

నియమించారు. బుధవారం గాంధీభవన్‌లో పీసీసీ పరిశీలకులతో నిర్వహించిన సమావేశంలో మే 20వ తేదీ వరకు డీసీసీ అధ్యక్షుల నియామకాలను పూర్తి చేస్తామన్నారు. మే నెలా ఖరులోగా గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చే.యాలని, ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు డీసీసీ సమావేశాలను నిర్వహిం చాలని మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేసిన విష యం తెలిసిందే. గ్రామ, మండల అధ్యక్ష పదవులకు ఐదుగురి పేర్లను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ముగ్గురి పేర్లను టీపీసీసీకి పంపించాలన్నారు. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవా లన్నారు. ఆ పేర్లను పరిశీలించి పీసీసీ ఒకరిని అధ్యక్షు డిగా ఖరారు చేయనుంది. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తయిన తర్వాత ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, ఇతరత్రా అం శాల గురించి విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత సందడి నెలకొననున్నది.

జెఎన్టీయూలో టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

రామగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)లో మే 7, 8 తేదీలలో నిర్వహించే టెక్నికల్ ఫెస్టకు సంబంధించిన ఆవిష్కృత్ 2025 పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో ఆరు బ్రాంచ్‌లకు చెందిన టెక్నికల్, నాన్ టెక్నికల్, కల్చర్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రతీ బ్రాంచ్ ప్రత్యేకమైన ప్రాజెక్టును తయారు చేయనుంది. మే 7న సాయంత్రం మూడో సంవత్సర విద్యార్థులు ఫ్లాష్‌మ్యాబ్ నిర్వహించనున్నారు. 8న కళాశాల వార్షికోత్సవం జరగనుంది. పరిపాలనాధికారి సుమన్, పిడి పింగిళి కృష్ణారెడ్డి, కో-ఆర్డినేటర్స్ శివ, అఖిల్, వివేక్ మిట్టల్, బీఆర్ కుశ్వంత్, హేమసుందర్, దేవిచరణ్, మహిళా కోఆర్డినేటర్స్ నిఖిత, అనుపమ, అలేఖ్య, శిరీష, హరిక, సహస్రతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16మంది ఎంపిక

కమాన్‌పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల గుండారంలో ఎంఎస్ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 16మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపనీ ప్రతినిధులు విద్యార్థులకు 6రౌండ్లలో పలు అంశాలపై పరీక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నెలకు 15వేల రూపాయల వేతనంతో పాటు వసతి టీఐఎస్ఎస్(టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీసెస్)లో డిగ్రీ చదివే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ తెలిపారు. కంపనీ ప్రతినిధి సుబ్రహ్మణంతో కలిసి విద్యార్థులకు ఉద్యోగ ఆఫర్ లెటర్స్ అందజేశారు.

లింగాపూర్‌లో ఉపాధిహామీ కూలీల నిరసన

అంతర్గాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లింగాపూర్‌లో ఉపాధిహామీ కూలీలు గురువారం నిరసన తెలిపారు. లింగాపూర్ రామగుండం కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియ నేపథ్యంలో జీవో విడుదల చేసి ఉపాధి హామీ పనులు నిలిపివేయాలని ఆర్డర్ చేయడంతో ఉదయం పని కోసం వెళ్లిన కూలీలు నిరసనకు దిగారు. బీఆర్ఎస్ నాయకుడు నిమ్మరాజుల రవి మాట్లాడుతూ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేయడం వల్ల ఉపాధి పోవడంతో పాటు ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు అధికంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే సింగరేణికి రైతులు దాదాపు 980ఎకరాలు అప్పజెప్పడంతో వ్యవసాయ ఉత్పత్తి కోల్పోయామని, పనులకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుం దన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా విలీనం చేయడం అన్యా యమన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు.

నేడు మెగా జాబ్ మేళా

సుల్తానాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు, డిగ్రీ పూర్తి చేసిన వారు మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫ్లిప్కార్ట్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, హెటిరో లాంటి ఏడు మల్టీ నేషనల్ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయని, ఆసక్తి ఉన్న వారు విద్యార్హత పత్రాలు, ఫోటోలు తీసుకుని రావాలని పేర్కొన్నారు. వివరాలకు 7893186719, 7893082090 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక పై హైకోర్టులో కేసు

మంథని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని హైకోర్టులో కేసు వేసినట్లు సముద్రాల రమేష్ గురువారం తెలిపారు. తప్పుడు బైలాతో ఎన్నికలు నిర్వహించడమే కాకుండా నామినేషన్ ప్రక్రియలో అక్రమాలు పాల్పడినట్లు తెలిపారు. తొలుత అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తన నామినేషన్ అంగీకరించిన ఎన్నికల అధికారులు ఓటింగ్ సమయంలో పోటీ నుంచి తప్పించి, ప్రత్యర్థి అభ్యర్థిని అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసు వేసినట్లు తెలిపారు. ఈకేసును జూన్ 7వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

మహిళ కడుపులో నుంచి కణితి తొలగింపు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామానికి చెందిన హేమలత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 4న గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చింది. వైద్యురాలు శ్రీదేవి హేమలతకు పరీక్షలు నిర్వహించి కడుపులోకి కణితి ఉన్నట్టు గుర్తించారు. పోలియోతో బాధపడుతున్న హేమలతకు కిడ్నీ సమస్య ఉండడంతో గైనిక్, యూరాలజీ, మత్తు డాక్టర్ల బృందం గురువారం ఆపరేషన్ నిర్వహించి కణితిని తొలగించారు. కణితి బరువు 2కిలోలు ఉందని, ఈ ఆపరేషన్ క్లిష్టమైన ప్పటికీ డాక్టర్ల బృందం విజయవంతంగా నిర్వహించినట్టు గైనిక్ విభాగం హెచ్‌ఓడీ అరుణ, శ్రీదేవి తెలిపారు. వైద్యులు జ్యోతి, యూరిలాజిస్ట్ నిషాంత్, జనరల్ సర్జన్ అనీల్‌కుమార్, స్రవంతి పాల్గొన్నారు.

జనారణ్యంలోకి నెమలి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో గురువారం జాతీయ పక్షి నెమలి అగుపించింది. ఉదయం నెమలిని కుక్కలు వెంబడిస్తుండగా మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత, రవీందర్ గమనించి అక్కడే ఉన్న మండపంలో భద్రపరిచారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారి రహ్మతుల్లా, పాషాలకు నెమలిని అప్పగించారు. నెమలిని బసంత్‌నగర్ బుగ్గగుట్టలో వదిలి పెట్టినట్టు ఫారెస్ట్ ఆఫీసర్ రహ్మతుల్లా తెలిపారు.

మృతుల కుటుంబాలకు శ్రీనుబాబు పరామర్శ

మంథని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు గురువారం పరామర్శించారు. పింగిళి మోహన్‌రెడ్డి, ఐలి లింగయ్య, సురేందర్‌రెడ్డి, తోట పుల్లమ్మ, బెజ్జాల సావిత్రి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఎంపీ ఆర్థిక సహాయం

ధర్మారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మేడారంలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణ నాటక ప్రదర్శనకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ పది వేల రూపాయల ఆర్థికసాయం చేశారు. కాడే సూర్యనారాయణ కళాకారులకు అందజేశారు.

రామయ్యపల్లిలో సంవిధాన్ ర్యాలీ

రామగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రామయ్యపల్లిలో గురువారం కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు జైబాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీని చేపట్టారు. పురవీధుల గుండా రాజ్యాంగ విశిష్టతను వివరిస్తు ర్యాలీని చేపట్టారు. తొట్లతిరుపతియాదవ్, తొటచంద్రయ్య, రొడ్డబాపన్న, ఆరెల్లిదేవక్క, నరేష్‌యాదవ్, పాల్గొన్నారు.